సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 7 । మే । 2025



కొనసాగుతున్న భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్న దర్శనానికి మంగళవారం భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణవ్రతాలు చేశారు.



ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తంగళ్లపల్లి: ఇళ్ల నిర్మాణాలను బట్టి బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్నామని డీపీవో షర్ఫుద్దీన్ తెలిపారు. రాళ్లపేటలో ఇందిరమ్మ ఇళ్లను మంగళవారం పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
36.0/26.0

వాతావరణం

ఆకాశం ఎండగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ మహేశ్ బీ గీతే



సిరిసిల్ల: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మహేశ్ బీ గీతే కోరారు. మోసపోతే జరిగిన గంట(గోల్డెన్ అవర్)లోపు 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఆఫర్లు, డిస్కౌంట్ల పేరుతో మొబైల్‌కు వచ్చే లింకులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజీలకు, కొత్త నంబర్లతో వచ్చే ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేస్తే మీ మొబైల్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యక్తిగత విషయాలు, ఫొటోలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియా అకౌంట్స్‌కు ప్రొఫైల్ లాక్ పెట్టుకోవాలని సూచించారు. లోన్‌యాప్‌లకు దూరంగా కోరారు. కస్టమర్ కేర్ నంబర్లను గూగుల్‌లో వెతకొద్దని సూచించారు. ఈజీ రిటర్న్స్, కమీషన్ బేస్డ్ సైట్లలో పెట్టుబడి పెట్టొద్దని, పాస్‌వర్డ్, ఓటీపీ, పిన్ నంబర్లను ఎవరికీ షేర్ చేయొద్దని కోరారు. 'డిజిటల్ అరెస్ట్'లో ఉన్నారని బెదిరింపులకు ఎవరైనా దిగినా స్పందించొద్దని సూచించారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



బోయినపల్లి/గంభీరావుపేట/వేములవాడరూరల్: అకాల వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు చేతికందే సమయంలో నీళ్లపాలవుతున్నాయి. బోయినపల్లి, గంభీరావుపేట మండలాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. కాంటా పెట్టిన ధాన్యం బస్తాలు కూడా తడిసిపోయాయి. బోయినపల్లి మండలం కోరెంలోని కేంద్రంలో రైతుల ధాన్యం కుప్పలు తడవడంతో లబోదిబోమన్నారు. కాంటా పెట్టిన సంచులు సైతం తడిశాయి.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుంది

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా సహకార అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. వేములవాడలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. అకాల వర్షానికి నష్టం జరిగిన రైతుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిపారు. చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. లారీల కొరత ఉందని, వేములవాడ పరిధిలో బాయిల్డ్ రైస్‌మిల్లులు సరిపడా లేనందున జాప్యమవుతుందని తెలిపారు.

బోనమో పోచమ్మా



వేములవాడ: రాజన్న దర్శనానంతరం భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలతో అమ్మవారి చెంతకు చేరుకుని బోనం, కల్లుసాక, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సమ్మె విజయవంతం చేయండి

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం సమ్మె పోస్టర్‌ను సిరిసిల్లలో ఆవిష్కరించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సిరిమల్ల సత్యం, ఉడుత రవి, మచ్చ వేణు, గాజుల రాజు, బూట్ల వెంకటేశ్వర్లు, అవధూత హరిదాసు, చింతకింది సుదర్శన్, దోమల రమేశ్, శ్యామ్, సతీశ్, సదానందం పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా స్వామి



ముస్తాబాద్(సిరిసిల్ల): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కదిరె స్వామిగౌడ్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు హైదరాబాద్‌లో నియామకపత్రం అందుకున్నారు. మండలంలోని మద్దికుంటకు చెందిన స్వామిగౌడ్ పదేళ్లుగా వెనుకబడిన తరగతుల హక్కుల కోసం పోరాడుతున్నారని, మరింత చురుకుగా పనిచేసేందుకు రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

ఫిట్‌నెస్ బాహుబలి

- వాహనాల ఫిట్‌నెస్ ఇక పక్కా..
- అందుబాటులోకి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్
- ఏఎఫ్‌ఎంఎస్ సాఫ్ట్‌వేర్‌తో సామర్థ్య పరీక్షలు
- త్వరలో రూ.8 కోట్ల యంత్రసముదాయం ఇన్‌స్టాలేషన్
- కేంద్రం ఆదేశాలతో తిమ్మాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్మాణం
- ఫిట్‌నెస్ వివరాలు నేరుగా 'వాహన్' పోర్టల్‌తో అనుసంధానం



ఏటీఎస్ కేంద్రం నమూనా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఒకప్పుడు వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ విషయంలో ఏదోలా నెట్టుకొచ్చేవారు. ఇందులో అక్రమాలకు పుష్కలంగా ఆస్కారం ఉండేది. ఫలితంగా ఫిట్‌నెస్‌లేని వాహనాలు రోడ్ల మీద అమాయకులను బలిగొన్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇకపై అలాంటి రోడ్డు ప్రమాదాలేవీ జరగకుండా రోడ్డు భద్రతలో భాగంగా.. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) అనే భారీ యంత్ర సముదాయాన్ని ఇన్‌స్టాల్ చేయనున్నారు. తిమ్మాపూర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో త్వరలో ఇన్‌స్టాల్ చేయనున్న ఈ యంత్ర సముదాయం.. ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ (ఏఎఫ్‌ఎంఎస్) ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పనిచేయనుండటం గమనార్హం. ఈ యంత్రాల ఇన్‌స్టాలేషన్ బాధ్యతలను ఆర్అండ్‌బీ అధికారులు తీసుకున్నారు. పూర్తి అత్యాధునిక సాంకేతికతతో నడిచే ఈ భారీ యంత్రాల సముదాయం ఇకపై ఉమ్మడి జిల్లాలోని అన్ని లైట్ మోటార్ వెహికిల్స్ నుంచి భారీ యంత్రాల వరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయనుంది.

ఏటీఎస్ ప్రత్యేకతలు ఏంటంటే..

ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ఒక యంత్రం కాదు. ఇది వాహనాల ముఖ్యమైన విడిభాగాల సామర్థ్యాన్ని కచ్చితంగా మదించి రిపోర్ట్ ఇచ్చే బహుళ యంత్ర సముదాయం. ఎందుకంటే వాహనంలో ఏ భాగం సరిగా పనిచేయకున్నా.. అది ప్రమాదాలకు దారితీస్తుంది. పైగా ప్రస్తుతం మాన్యువల్‌గా జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లలో అనేక లోపాలు ఉన్నాయి. అందుకే దేశవ్యాప్తంగా అలాంటి లోపాలు నివారించేందుకు ఏకరూపకంగా, దోషరహితంగా, పూర్తి కంప్యూటీకరణ చేసిన ఏటీఎస్ యంత్రాలతో కచ్చితమైన ఫిట్‌నెస్ రిపోర్టు ఇవ్వడం దీని ప్రత్యేకత. హెడ్‌లైట్, స్టీరింగ్, టైర్ కోసం స్లిప్‌టెస్ట్, సస్పెన్షన్, ఇంజిన్, నాయిస్, ఎయిర్‌పొల్యూషన్.. ఇలా ప్రతీ విడిభాగం పనితీరును పకడ్బందీగా తనిఖీ చేసి ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ (ఏఎఫ్‌ఎంఎస్) రిపోర్ట్ ఇస్తుంది. ఆ వెంటనే.. ఆ రిపోర్ట్‌ను కేంద్రం ఆధ్వర్యంలో ఉన్న 'వాహన్–పరివాహన్' పోర్టల్‌కు చేరవేస్తుంది. ఇలా ప్రతీ బండి సామర్థ్యం, దాని వివరాలు అన్నీ దేశంలో ఎక్కడ నుంచైనా అధికారులు చూసే వీలుంటుంది. ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని గ్రానైట్, ఇసుక, మైనింగ్, బొగ్గు, రైస్‌మిల్లుల కోసం నడిచే భారీ వాహనాలు ఇకపై ఈ యంత్రాలతో ఫిట్‌నెస్ తీసుకోవాల్సిందే. పాత వాహనాలకు ఫిట్‌నెస్ లేకపోతే ఒకటి రెండు సార్లు అవకాశం ఇస్తారు. అయినా మార్పు రాకపోతే ఎండ్ ఆఫ్ లైఫ్ సర్టిఫికెట్ జారీ చేసి ఆ వాహనాలను స్క్రాప్‌కు పంపిస్తారు.

15ఏళ్లు నిండిన వాహనాల వివరాలు

జిల్లా	వాహనాలు
కరీంనగర్	1,58,129
జగిత్యాల	4,283
పెద్దపల్లి	9,660
రాజన్నసిరిసిల్ల	2,039
మొత్తం	1,74,111

నోట్: ఆటోరిక్షా, కాంట్రాక్ట్ క్యారేజ్, విద్యాసంస్థల బస్సులు, గూడ్స్‌క్యారేజ్, మ్యాక్సీ క్యాబ్, మోటర్ క్యాబ్, కారు, ద్విచక్రవాహనం, ప్రైవేట్ సర్వీస్ వెహికిల్, స్టేజీ క్యారేజ్, ట్రాక్టర్, ట్రైలర్‌తో కలిపి.

రెండెకరాల స్థలంలో..

రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు ఒక ఏటీఎస్ యంత్ర సముదాయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కరీంనగర్‌లోని తిమ్మాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో ఈ యంత్ర సముదాయాన్ని ఇన్‌స్టాల్ చేయనున్నారు. ఇది ఉమ్మడి జిల్లా వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందించనుంది. భారీ వాహనాలకు 1500 చదరపు మీటర్ల స్థలం కావాల్సి వస్తుంది. ఇలా ఉమ్మడి జిల్లాలోని హెవీ, లైట్ మోటార్ వెహికిల్స్‌ను బట్టి.. ఇక్కడ నాలుగు లేన్లు అవసరమవుతాయని ఇందుకోసం ఎకరన్నర నుంచి రెండెకరాల స్థలం అవసరం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇందుకోసం భారీ షెడ్లు, వచ్చే వాహనాల పార్కింగ్, డ్రైవర్ల కోసం వెయిటింగ్ రూం, సీటింగ్ ఏర్పాటు, టాయిలెట్లు, జనరేటర్లు తదితరాలు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఈ యంత్రాల ఇన్‌స్టాలేషన్, షెడ్ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన అంతా కేంద్రం మార్గదర్శకాల మేరకు రోడ్లు భవనాల శాఖ ఏర్పాటు చేయనుంది.

ఆలయాల అభివృద్ధికి కృషి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్‌కుమార్



గంభీరావుపేటలో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లాలో ఆలయాలను ఆధునీకీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో బద్దిపోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో మంగళవారం పూజలు చేశారు. బండి సంజయ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాల స్థితిగతులపై నివేదిక సమర్పించాలని దేవాదాయశాఖ అధికారులను కోరినట్లు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చందుపట్ల లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శులు మద్దుల బుగ్గారెడ్డి, బందారపు లక్ష్మారెడ్డి, నాయకులు సల్ల సత్యంరెడ్డి, రాగుల గాల్‌రెడ్డి, చందుపట్ల రాజిరెడ్డి, కిరణ్‌నాయక్, పొన్నాల తిరుపతిరెడ్డి, నంది నరేశ్, సంజీవరెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

ధాన్యం పైసలు వెంటనే జమ చేయాలి

ధాన్యం కొని 20 రోజులైనా రైతులకు డబ్బులు ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని, వెంటనే జమచేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. గంభీరావుపేటలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. వడ్ల కొనుగోలులోనూ రాజకీయ జోక్యం పెరిగిందని, అధికారులకు స్వేచ్ఛనిచ్చి కొనుగోలు చేపట్టాలని కోరారు. కొనుగోళ్లపై ప్రశ్నిస్తున్న రైతులపై కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు డబ్బులను కేంద్రమే ఇస్తుంటే రైతులను ఎందుకు అరిగోస పెడుతున్నారని ప్రశ్నించారు.

రథోత్సవానికి రండి..

కొత్తపల్లిలో ఈనెల 13న నిర్వహించే శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఆహ్వానపత్రిక అందించారు. సర్వాలలో మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్నారు. గంభీరావుపేటకు చెందిన దేవసాని కృష్ణ తండ్రి జనార్దన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు గంట అశోక్, నాయకులు రాజేందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కోడె రమేశ్, కృష్ణకాంత్‌యాదవ్, కొక్కు దేవేందర్ యాదవ్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వచ్చే నెలలో ప్రత్యేక లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ



మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పి.నీరజ

సిరిసిల్లకల్చరల్: అపరిష్కృత కేసుల సత్వర పరిష్కారం కోసం వచ్చే నెలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. జూన్ 9 నుంచి 14 వరకు నిర్వహించే అదాలత్‌లో ప్రధానంగా చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. సంప్రదింపులు, చర్చల ద్వారా రాజీ కుదుర్చుకునే కక్షిదారులు 14న జరిగే మెగా జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారానికి నోచుకునేలా పోలీస్ యంత్రాంగం న్యాయవాదులు సహకరించాలని సూచించారు. న్యాయమూర్తులు లక్ష్మణాచారి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్, ప్రవీణ్‌కుమార్, గడ్డం మేఘన, కావేటి సృజన, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, లోక్‌అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, ఆడెపు వేణు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పూర్తిచేస్తాం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- వేములవాడ మెయిన్‌రోడ్డు పరిశీలన



వేములవాడ మెయిన్‌రోడ్డు వెడల్పు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ: మూలవాగు నుంచి రాజన్న ఆలయం వరకు గల రోడ్డు విస్తరణకు భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణ, భూసేకరణ పనులను మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేములవాడలో 80 ఫీట్ల రోడ్డుకు మార్కింగ్ చేయడంతోపాటు 350 కుటుంబాలకు నష్టపరిహారం కింద గజానికి రూ.30వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని, 50 ఏళ్లుగా ఈ రోడ్డు విస్తరణకు నోచుకోలేదన్నారు. నిర్వాసితులకు నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. విధుల్లో అలసత్వం వహించిన అధికారులకు షోకాజ్ నోటీసులు అందుతాయని హెచ్చరించారు. నలుగురు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారని, మిగతావి సరైనవి కావని డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ రాధాబాయి స్పష్టం చేశారు. అధికారులకు సహకరించాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ సంపత్‌రెడ్డి, ఆర్అండ్‌బీ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భూయజమానుల ఆందోళన

అధికారులు పరిశీలిస్తుండగానే.. ఆయా భవనాల యజమానులు ఆలయం ఎదుట ఆందోళన చేశారు. తమకు సరైన నష్టపరిహారం అందించాలని, ఇంకాస్త సమయం ఇవ్వాలని వారు కోరారు. సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకోగా.. పోలీసుల సహాయంతో కొలతలు పూర్తి చేశారు.

భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

రుద్రంగి(వేములవాడ): భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. రుద్రంగి, మానాలలో నిర్వహించిన సదస్సుకు హాజరై మాట్లాడారు. వివిధ కారణాలతో రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇవ్వని వారు తర్వాత అధికారులకు అందజేయాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. మానాలలోని కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో శేషాద్రితో కలిసి పరిశీలించారు.

వార్పిన్ కార్మికుల సమ్మెబాట

- కూలీరేట్లు పెంచాలని డిమాండ్
- కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డికి వినతిపత్రం



కేకే మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కార్మిక నాయకులు

సిరిసిల్ల: వార్పిన్ కార్మికులు మంగళవారం నుంచి సమ్మె బాట పట్టారు. వార్పిన్ కార్మికులను ఇస్తున్న కూలీ రేట్లను పెంచాలని కోరుతూ పనులు బంద్ చేసి సమ్మెలోకి దిగారు. దీంతో స్థానికంగా మహిళాశక్తి చీరల ఆర్డర్ల ఉత్పత్తికి విఘాతం కలిగింది. సిరిసిల్లలో వార్పిన్ కార్మికుల సమావేశం మంగళవారం జరిగింది. పవర్‌లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ వార్పిన్, వైపని, పవర్‌లూమ్ కార్మికులు పక్షం రోజుల కిందట ప్రభుత్వం ఇచ్చిన మహిళాశక్తి చీరల ఉత్పత్తి ఆర్డర్లకు కూలీ పెంచాలని సమ్మె చేయగా.. చేనేత, జౌళి శాఖ అధికారులు బతుకమ్మ చీరలకు ఇచ్చిన కూలీ కంటే మెరుగైన వేతనం అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారులు హామీ ఇచ్చిన మేరకు మీటరు బట్టపై రూ.2 కూలీ పెంచారన్నారు. ఈమేరకు కార్మికుల కూలీ పెరగాల్సి ఉండగా.. యజమానులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న కూలీని కార్మికులకు ఇచ్చేందుకు యజమానులకు మనసు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జౌళిశాఖ అధికారులు కార్మికుల కూలీ రేట్లను నిర్ణయించే బాధ్యతను యజమానులకు ఇవ్వడంతోనే ఈ పరిస్థితి ఎదురైందన్నారు. ఇప్పటికైనాకూలీరేట్లు పెంచాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, కార్మిక నాయకులు ఉడుత రవి, మచ్చ వేణు, బూట్ల వెంకటేశం, దోమల రమేశ్, ఐరన్ ప్రవీణ్, సామల శీను పాల్గొన్నారు.

నేడు పాలిస్టర్ అసోసియేషన్ భవన్ ఎదుట ధర్నా

పవర్‌లూమ్ కార్మికులు, వార్పర్లు, వైపనికార్మికుల కూలీరేట్లు పెంచాలని కోరుతూ బుధవారం సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్నామని సీఐటీయూ నాయకులు ప్రకటించారు. ఈ ధర్నాలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ నేత మహేందర్‌రెడ్డికి వినతి

కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం మహిళాశక్తి చీరలకు ఆర్డర్లు ఇవ్వగా.. కార్మికుల కూలీలో కోత విధిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు. సరైన వేతనం ఇవ్వకుండా కూలీ రేట్లను తగ్గించాలని చూస్తున్నా యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

సైకాలజిస్ట్ అసోసియేషన్ ఫార్మేషన్ డే


కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఫార్మేషన్ డే నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్నం చందర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి చొప్పదండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

అశోకచక్ర అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: సాహసోపేతంగా ప్రజలను కాపాడిన పోలీసులకు స్వాతంత్య్ర దినోత్సవం నాడు కేంద్ర హోంశాఖ అందించే అశోకచక్ర అవార్డు కోసం అర్హులైన పోలీసులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ప్రకటనలో కోరారు. ప్రజల ప్రాణరక్షణలో తన ప్రాణాలు ఫణంగా పెట్టి అమరులైన వారికి అశోకచక్ర, ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికి కీర్తిచక్ర, శౌర్యం ప్రదర్శించిన సిబ్బందికి శౌర్యచక్ర అవార్డులు ప్రదానం చేస్తారని వివరించా రు. అర్హత గల వారు జిల్లా ఎస్పీకి తమ దరఖా స్తులను నిర్ణీత నమూనాలో సమర్పించాలని సూచించారు. జూలై 2024 నుంచి జనవరి 2025 మధ్యలో జరిగిన సంఘటన అయి ఉండాలని, ఫొటోగ్రాఫర్ వివరాలు సమర్పించాలని కోరారు.

ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఆక్షేపణీయం



మాట్లాడుతున్న రమానాథ్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగులపై చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుమాల రమానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య పాఠశాలలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కించపరిచేలా, తెలంగాణ ప్రజలను ఢిల్లీలో దొంగలుగా చూస్తున్నారని, ఉద్యోగులు ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని టీపీటీఎఫ్ ఖండిస్తుందన్నారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించేలా సీఎం అసత్యాలు మాట్లాడడం శోచనీయమన్నారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సత్తు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు దబ్బెడ హనుమాండ్లు, మందాడి శ్రీనివాస్‌రెడ్డి, నూగురి దేవేందర్ , జిల్లా కార్యదర్శులు మైలారం తిరుపతి, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బొజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ కొనిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తూ ప్లాట్ కొనిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. 2023లో పట్టణంలోని పానగంటి కావ్య నుంచి మ్యనకొండ సాయికిరణ్ తక్కువ ధరకు ప్లాట్ కొనిస్తానని రూ.93లక్షలు తీసుకున్నాడు. ప్లాట్ చూపించకుండా మోసం చేస్తున్నాడు. డబ్బు అడిగితే అంతుచూస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అంజన్నా.. నీడ లేదన్నా..

- ఆలయ పరిసరాల్లో అక్కడక్కడే చలువ పందిళ్లు
- ఎండకు భక్తుల ఇబ్బంది
- వై జంక్షన్ నుంచి దారి పొడవునా చలువ పందిళ్లు వేయాలని భక్తుల వేడుకోలు


ఆలయ సమీపంలో చలువ పందిళ్లు


కొండగట్టులో స్వామివారి దర్శనం కోసం ఎండలో నడిచి వెళ్తున్న భక్తులు

మల్యాల(చొప్పదండి): ఎండల తీవ్రతకు కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. స్వామివారిని దర్శించుకుని సేద తీరేందుకు నీడ కరువైంది. ఆలయ పరిసరాల్లో మాత్రమే చలువ పందిళ్లు వేశారు. వై జంక్షన్ నుంచి ఆలయ సమీపం వరకు సుమారు మూడు వందల మీటర్ల దూరం నడిచి వెళ్లాలి. ఆ ప్రాంతంలో చలువ పందిళ్లు లేక ఎండకు మహిళలు, చిన్నారులు, వృద్ధులకు తిప్పలు తప్పడంలేదు.

కాలినడకన వచ్చే భక్తుల ఇబ్బంది

కొండగట్టులో ఆలయ సమీపం వరకు వాహనాలు వెళ్తుండడంతో కాలినడక వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వాహనాలను ఆలయ సమీపంలోకి అనుమతించకూడదని, వికలాంగులు, వృద్ధులకు సంబంధించి వాహనాలను మాత్రమే అనుమతించాలని ఆలయ ఈవో ఆదేశాలు జారీ చేశారు.

అక్కడక్కడ మాత్రమే పందిళ్లు

వేసవి సెలవులు ప్రారంభం నుంచి రోజురోజుకు ఆంజనేయస్వామిని దర్శించుకునే భక్తుల రద్దీ పెరుగుతోంది. కాగా, భక్తులు ఎండ వేడిమి తట్టుకోలేక ఆలయ సమీపంలో నీడ కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆలయ ప్రధాన, వెనక ద్వారంతో పాటు ఆలయ కార్యాలయం ఎదుట, తాత్కాలిక అన్నదానం సత్రం వద్ద కొంతమేర చలువ పందిళ్లు ఉన్నా భక్తులకు సరిపోవడం లేదు.

వై జంక్షన్ నుంచి..

అంజన్న దర్శనానికి వచ్చేవారి కోసం వై జంక్షన్ సమీపంలోని ఆలయ తోరణం నుంచి చలువ పందిళ్లు వేయాలని భక్తులు కోరుతున్నారు. కాలినకడన వెళ్తున్న భక్తులు ఎండ వేడిమి తట్టుకోలేక ఆలయ ద్వారం వరకు చెప్పులతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

దారి పొడవునా వేయాలి



కొండగట్టుకు వచ్చే భక్తుల కోసం ఆలయ తోరణం వై జంక్షన్ నుంచి దారి పొడవునా పోలీస్ అవుట్ పోస్ట్ వరకు చలువ పందిళ్లు వేయాలి. కాలినడక వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హనుమాన్ జయంతి వరకు వేచి చూడకుండా త్వరగా చలువ పందిళ్లు వేయాలి.

– బట్టు పవన్‌కుమార్, మల్యాల

భక్తులకు ఇబ్బంది కలగనీయం

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే వాహనాలు ఆలయం వరకు వెళ్లకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలంలో పార్కింగ్ చేసేలా చర్యలు చేపట్టినం. భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు వేసినం.

– శ్రీకాంత్‌రావు, ఈవో, కొండగట్టు

అంజన్న సన్నిధిలో రద్దీ





మల్యాల(చొప్పదండి): అంజన్న సన్నిధిలో మంగళవారం రద్దీ నెలకొంది. ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కోనేరులో స్నానమాచరించి స్వామివారలకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

రోడ్డుకిందకు దూసుకెళ్లిన లారీ



శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని వంకాయగూడెంలో మంగళవారం వేకువజామున బొగ్గులారీ రోడ్డు కిందకు దూసుకుపోయింది. బొగ్గులోడ్ లారీ వైజాగ్ నుంచి నాగపూర్ వెళ్తుండగా వంకాయగూడెంలోకి చేరుకోగా డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ రోడ్డు కిందకు దూసుకుపోయిందని స్థానికులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో మీసేవ కేంద్రం దగ్ధం



సిరిసిల్లటౌన్: షార్ట్ సర్క్యూట్‌తో యువకుడి ఉపాధి కేంద్రం కాలిపోయిన ఘటన మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలు.. సిరిసిల్ల పట్టణంలోని యూనియన్ బ్యాంకు సమీపంలో రజనీకాంత్ చాలా రోజులుగా మీ సేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి షాప్‌ను కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచే సరికి కంప్యూటర్, ఫర్నీచర్, ప్రింటర్ తదితర వస్తువులు కాలిపోయినట్లు పేర్కొన్నాడు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

'నల్లరంగు నోటు' ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్(ధర్మపురి): నల్లరంగు నోటు పేరిట అమాయకుల నుంచి డబ్బు కాజేసే ముఠాను పట్టుకున్నట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. మంగళవారం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. చెగ్యాం గ్రామానికి చెందిన రామిల్ల విజయ్‌సాగర్‌ను నల్లరంగులో ఉన్న రూ.500 నోట్లను ఒరిజినల్‌గా మార్చే రసాయనం ఉందని కంది నరేశ్, పాలాజి శ్రీనివాస్, ఎంబడి మల్లేశ్, అల్లాపు రాజు, మగ్గిడి కిషన్ నమ్మించారు. 17 ఫిబ్రవరి 2025 రోజున మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్‌పల్లి గ్రామానికి తీసుకెళ్లారు. ఒక ప్లాస్టిక్ గ్లాస్‌లో ఏదో రసాయనం పోసి నిందితుల వద్ద ఉన్న నలుపురంగు రూ.500 నోట్లను రసాయనంలో ముంచి ఒరిజినల్ నోట్లలా మారిపోయినట్లు నమ్మించారు. ఈ క్రమంలో రూ.లక్షకు రూ.ఐదు లక్షల నలరంగు రూ.500 నోట్లు ఇస్తామని, రసాయనంలో ముంచి సులభంగా లక్షలు సంపాదించవచ్చని విజయ్‌సాగర్‌ను మభ్యపెట్టారు. మార్చి 4న రూ.7 లక్షలు ఒరిజినల్ నోట్లు తీసుకున్నారు. కోటిలింగాలకు వస్తే రూ.35 లక్షల నల్లరంగు నోట్లు ఇస్తామని బొమ్మ కరెన్సీ నోట్ల కట్టలు చూపించారు. అదే సమయంలో రాజశేఖర్, కార్తీక్ అనే ఇద్దరు నిందితులు పోలీసులమని బెదిరించారు. నిందితులందరూ కలిసి రూ.7 లక్షల ఒరిజినల్ నోట్లతో పారిపోయారు. తర్వాత వారికి విజయ్‌సాగర్ ఫోన్ చేయగా, మరోసారి డబ్బు అడిగితే చంపేస్తామని బెదిరించారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా మంగళవారం నిందితులు వెలటూర్ మీదుగా కరీంనగర్ వెళ్తుండగా, స్తంభంపల్లి వద్ద తనిఖీల్లో శ్రీనివాస్, రాజు, మల్లేశ్, రాజశేఖర్, నరేశ్ పట్టుబడ్డారు. మరో ముగ్గురు నిందితులు కిషన్, నవీన్, కార్తీక్ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి కారు, ఐదు సెల్‌ఫోన్లు, రూ.4వేల నగదు, ఆరు నలుపురంగు రూ.500 నోట్లు, 570 బొమ్మ కరెన్సీ నోట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. గతంలోనూ నిందితులపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రాంనర్సింహారెడ్డి, వెల్గటూర్, ధర్మపురి, బుగ్గారం ఎస్సైలు ఉమాసాగర్, ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వేములవాడ: వేములవాడలోని మార్కండేయనగర్‌లో తాళం వేసిన ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. తాటికొండ సంతోష్ అనే ఫిజియోథెరపిస్ట్ కుటుంబ సభ్యులతో కలిసి ఐదు రోజుల క్రితం విహారయాత్రకు వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. ఇంట్లో ఉన్న దాచిన రూ.25వేలకు పైగా నగదు, 10 గ్రాముల బంగారం వస్తువులు చోరీ అయింది. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరి పొలం దగ్ధం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): హుస్సేన్‌మియా వాగు సమీపంలో మంగళవారం ప్రమాదవశాత్తు జంగ రాజయ్యకు చెందిన ఎకరంపావు బాస్మతి వరి, కొరకండ్ల శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 30 గుంటలు బాస్మతి వరి కుప్ప మంటల్లో కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. వరి కొయ్యలు కాలపెట్టడంవల్లే నిప్పురవ్వలు గాలికి చెలరేగి మంటలు వ్యాపించినట్లు బాధిత రైతులు వాపోయారు. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

- ఆరేళ్ల కొడుకును చితక్కొట్టిన తల్లి
- చికిత్స పొందుతూ మృతి చెందిన చిన్నారి
- సిరిసిల్లలో కన్నతల్లి కర్కశత్వం


దెబ్బలు తాళలేక మృతిచెందిన ఆరుష్

సిరిసిల్లటౌన్: మాతృత్వం మంటగలిసింది. కన్నతల్లి కర్కశత్వం ఆరేళ్ల చిన్నారికి నూరేళ్లు నింపింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కన్నకొడుకునే చితకబాది అతడి మృతికి కారణమైంది. ఈ ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం విషాదం నింపింది. పోలీసులు, చిన్నారి నానమ్మ అనసూయ, స్థానికుల కథనం ప్రకారం.. సిరిసిల్లలోని సుభాష్‌నగర్‌కు చెందిన మంగళారపు అరుణ్‌కు అదే ప్రాంతానికి చెందిన మాధవితో చాలా ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు ఆదిత్రి(9), కొడుకు ఆరుష్(6) ఉన్నారు. అరుణ్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి మాధవి స్థానిక వెంకంపేటలో ఉంటోంది. ఆదిత్రి, ఆరుష్ నానమ్మ, తాతయ్య వద్ద ఉండగా.. కొద్దిరోజుల క్రితం మాధవి వారితో గొడవపడి పిల్లలను బలవంతంగా తీసుకెళ్లింది. అయితే మాధవి కొద్దిరోజులుగా వెంకపేటకు చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం నెరుపుతున్నట్లు సమాచారం. పిల్లలిద్దరూ ఇంటివద్దనే ఉంటుండడంతో తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని భావించిన మాధవి ప్రియుడితో కలిసి వారిని తీవ్రంగా హింసిస్తున్నారు. మంగళవారం కూడా ఆరుష్‌ను తీవ్రంగా కొట్టడంతో దెబ్బలకు తాళలేక ప్రాణాలు కోల్పోయాడు. ఆరుష్ నానమ్మ అనసూయ ఫిర్యాదు మేరకు మాధవితోపాటు ఆమె ప్రియుడు బాలకృష్ణపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. నిందితులిద్దరిని పోలీసులు అదుపులో తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

ఈసారైనా సిరులు కురిపించేనా..?

- రాజన్న భక్తుల తలనీలాల సేకరణకు నేడు ఏడోసారి టెండర్
- ఈ–టెండర్‌తో సరి
- బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు రద్దు


కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు (ఫైల్)

వేములవాడ: ఎములాడ రాజన్నకు భక్తులు సమర్పించుకునే కురులతో ఏటా సిరులు కురిశాయి. ఈనేపథ్యంలో కరోనా కాలంలో కల్యాణకట్టను మూసివేశారు. తర్వాత 2023–25 రెండేళ్ల కోసం నిర్వహించిన తలనీలాల సేకరణ టెండర్ రూ.19.01 కోట్లకు పెరిగింది. దీంతో రాజన్నకు భక్తుల కురులు సిరులు కురిపించాయి. అయితే ఏడాదిపాటు సక్రమంగా చెల్లింపులు చేసిన సదరు కాంట్రాక్టర్ పది నెలలుగా సేకరణ నిలిపివేసి చేతులెత్తేశాడు. దీంతో అధికారులు రంగంలోకి దిగి నేరుగా తలనీలాలను సేకరించి భద్రపరిచారు. టెండర్ సమయం 11 ఏప్రిల్ 2025తో ముగిసింది. ఈలోగా సదరు కాంట్రాక్టర్ కొన్ని డబ్బులను స్వామివారికి చెల్లించి మిగతా డబ్బు జూన్ వరకు చెల్లిస్తానని అగ్రిమెంట్ చేశారు. ఇందుకు ప్రభుత్వం నుంచి ఓ స్పెషల్ ఆర్డర్ కూడా రావడం గమనార్హం.

నేడు ఏడోసారి.. ఈ– టెండర్‌కే మొగ్గు

రాజన్నకు భక్తులు కల్యాణకట్టలో సమర్పించుకునే తలనీలాలను పోగు చేసుకునే హక్కు కోసం గత టెండర్ ఏప్రిల్ 11తో ముగియగా, అంతకుముందే నాలుగుసార్లు ప్రకటన చేసి టెండర్ నిర్వహించారు. కానీ ఎవరూ హాజరుకాలేదు. ఐదోసారి రూ.13.67 కోట్లు, ఆరోసారి రూ. 14.01 కోట్లు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొన్నారు. ఆశించినంత డబ్బు రాకపోయేసరికి ఆలయ అధికారులు నిబంధనల మేరకు టెండర్‌ను రద్దు చేశారు. దీంతో బుధవారం ఏడోసారి తలనీలాల టెండర్ నిర్వహించనున్నారు. అయితే ఈసారి సీల్డ్ టెండర్, బహిరంగ వేలం పాటలను ఆలయ అధికారులు రద్దు చేసి కేవలం ఈ–టెండర్‌కు మాత్రమే అవకాశం కల్పించారు. ఈసారైనా భక్తుల కురులతో రాజన్నకు సిరులు కురుస్తాయా.. లేదా వేచి చూడాల్సిందే.

తలనొప్పిగా తలనీలాల సేకరణ

భక్తుల తలనీలాల సేకరణ ఆలయ అధికారులకు తలకు మించిన భారంగా మారింది. టెండర్ నిర్వహించి కాంట్రాక్టర్‌కు అప్పగిస్తే ఈ పనులు కాంట్రాక్టరే తమ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని నిర్వహించేవారు. అయితే కాంట్రాక్టర్ల నుంచి సరైన స్పందన రాక కల్యాణకట్ట నుంచి తలనీలాలను సేకరించి పోగు చేయడం ఇబ్బందిగా మారిందని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. సీసీ కెమెరాలు, ప్రత్యేక సిబ్బంది, సెక్యూరిటీతో తలనీలాలను సేకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

15 గంజాయి కేసుల్లో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేశ్ బీ గీతే

- ఐదు కేసుల్లో పరారీ
- గంజాయి నిరోధానికి సమాచారం ఇవ్వండి: ఎస్పీ మహేశ్ బీ గీతే

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో 15 గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న ఎండీ హమ్మద్ (23)ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. మంగళవారం వివరాలు వెల్లడించారు. జిల్లాలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, బోయినపల్లి, చందుర్తి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 15 కేసుల్లో హమ్మద్ నిందితుడని వివరించారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాలుగు, చందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మరో కేసులో పరారీలో ఉన్నాడని ఎస్పీ వివరించారు. హమ్మద్ సిరిసిల్లకు వస్తున్నాడనే సమాచారం మేరకు టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని ఎల్లమ్మ చౌరస్తా వద్ద పట్టుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు.

గంజాయి నిరోధానికి సహకరించండి

జిల్లాలో గంజాయి రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. గంజాయి నిరోధానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలన్నారు. జిల్లాలో గంజాయి విక్రయించినా, సాగు చేసినా, రవాణా చేసినా, సేవించిన వారి సమాచారం 87126 56392 నంబర్‌కు అందించాలని ఎస్పీ కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతానమి తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ కృష్ణ, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, ఇంతియాజ్ ఉన్నారు.

మావోల అంతం సులువు కాదు

- పౌర హక్కులను అణిచి వేయొద్దు
- కేంద్రం వైఫల్యంతోనే పహెల్గాం ఘటన
- రైతులు, కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: కర్రెగుట్ట ప్రాంతంలో మావోలను అంతం చేయడం అంత సులువు కాదని, కేంద్ర ప్రభుత్వం వెంటనే వారితో చర్చలు జరపాలని సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. యుద్ధం పరిష్కారం కాదని, చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. పార్టీ పట్టణ మహాసభలు మంగళవారం రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రంలోని కార్మిక భవనంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు సుంకరపెల్లి శాంతాబాయి చేతుల మీదుగా పతాకావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సభలో చాడ మాట్లాడారు. పహెల్గాం ఘటనకు కేంద్రప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. కార్మికుల తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎలిగేటి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది సీపీఎం కార్యకర్తలు చాడ సమక్షంలో పార్టీలో చేరారు. మూడేళ్లలో అమరులైన వారికి సంతాపం ప్రకటించారు. పార్టీ పట్టణ కార్యదర్శి పంతం రవి మూడేళ్లలో జరిగిన కార్యక్రమాలను నివేదించారు. మహాసభల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు, కార్యవర్గ సభ్యులు కడారి రాములు, మీసం లక్ష్మణ్, అనసూర్య, కూర రాకేష్, మంద అనిల్ పాల్గొన్నారు.

పంటమార్పిడితో సుస్థిర ఆదాయం

- వ్యవసాయ శాస్త్రవేత్తలు
- చంద్రంపేటలో అవగాహన సదస్సు


కరపత్రం ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సిరిసిల్ల: రైతులు పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధిస్తూ.. సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సతీశ్ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ శివారులోని చంద్రంపేటలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు–అన్నదాతల అవగాహన' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అధునాతన వ్యవసాయ సాంకేతిక విధానాలు వివరించారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, పచ్చిరొట్ట పంటలు వేసుకోవాలని సూచించారు. అవసరం మేరకే రసాయనాలను వినియోగించుకోవాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల రశీదులను భద్రపరచుకోవాలన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ సంపత్, వ్యవసాయాధికారి సందీప్, వ్యవసాయ విస్తరణ అధికారులు లతశ్రీ, రాజ్‌కుమార్, వ్యవసాయ విద్యార్థులు సతీశ్, సౌమ్య, మాజీ కౌన్సిలర్ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ బాలయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలి

- తపస్ జిల్లా అధ్యక్షుడు గశికంటి శ్రీనివాస్



బోయినపల్లి(చొప్పదండి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని తపస్ జిల్లా అధ్యక్షుడు గశికంటి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలల్లోపు పెండింగ్ డీఏలు, కొత్త పీఆర్సీ అమలు చేస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన సీఎం చేతులెత్తేయడం సరికాదన్నారు. రాష్ట్ర కార్యదర్శులు ఒడ్నాల జగన్‌మోహన్, కటుకం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయకృష్ణారెడ్డి ఉన్నారు.